కొనసాగుతున్న 'గుమ్మటాల' ఆక్రమణ

- టీడీపీ నాయకుల కనుసన్నల్లో పనులు!
- వేలాది రూపాయలకు అమ్ముతున్నారంటూ వైఎస్సార్ సీపీ ఆరోపణ



గుమ్మటాల చెరువును ఆక్రమించి నిర్మించిన షెడ్లు

మచిలీపట్నంటౌన్: నగరంలోని విలువైన గుమ్మటాల చెరువు భూమిని టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. 2014–19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ ప్రాంతంలో ఉన్న ఆ పార్టీ నేతలు ప్లాట్లు వేసి విక్రయించారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. వారి కనుసన్నల్లోనే ఆక్రమణలు జరగ్గా పెద్ద ఎత్తున రేకులషెడ్లు ఏర్పాటు చేశారు. 17 ఎకరాల చెరువు స్థలంలో ఇప్పటి వరకు దాదాపు 4 నుంచి 5 ఎకరాల మేర భూమిని స్థలాలుగా మార్చి నివాసాలు ఏర్పాటు చేశారు.

పగలు, రాత్రి ఆక్రమణలు

ఈ ఆక్రమణలపై వివాదం కోర్టులో కొనసాగుతోంది. అయినా వాటిని లెక్క చేయని ఆక్రమణదారులు ఆ ప్రాంతంలో ప్రస్తుతం రేయింబవళ్లు నివాసాల ఏర్పాటు పనులు కొనసాగిస్తున్నారు. ప్లాట్లను రూ.70 వేల నుంచి రూ. లక్ష వరకు ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు విక్రయాలు జరిపి ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో ఆక్రమణలు జరిగిన సమయంలో మునిసిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం పోలీస్ పహారా నడుమ తొలగింపు చర్యలు చేపట్టారు. అప్పుడు ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు ఆక్రమణల తొలగింపును అడ్డుకున్నారు. దీంతో ఈ వ్యవహారం రసాభసగా మారింది. తిరిగి టీడీపీ అధికారంలోకి రావటంతో మళ్లీ చెరువు స్థలంలో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. స్థలాలను కొనుగోలు చేసిన వ్యక్తులు స్థలం తమది అనిపించుకునేందుకు పరదాలు కడుతున్నారు. కొంత మంది సిమెంట్ పోల్స్‌తో షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం చోద్యం చూస్తోంది. టీడీపీ ప్రజాప్రతినిధి అండదండలతోనే ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఆక్రమణలు చేస్తున్నారని నగరంలో చర్చ జరుగుతోంది.



గుమ్మటాల చెరువులో రాత్రి వేళల్లో జరుగుతున్న ఆక్రమణలు

త్వరలోనే ఆక్రమణలు తొలగిస్తాం



గుమ్మటాల చెరువులో ఆక్రమణలను త్వరలోనే తొలగిస్తాం. పోలీస్ పహారాతో పెద్ద ఎత్తున తొలగింపు కార్యక్రమం చేపడతాం. స్థలం వస్తుందనే ఆశతో ఇళ్లు కట్టుకుని పేదలు నష్టపోవద్దు. ఈ స్థలంలో గృహాలు నిర్మిస్తే ఎప్పటికైనా తొలగిస్తారు. కొంతమంది మాటలు నమ్మి ఆ స్థలంలో గృహాలు నిర్మించడం చట్టవిరుద్ధం. ఇళ్లు ఏర్పాటుచేసుకుంటే ఇబ్బందులు తప్పవు.

–సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, కార్పొరేషన్ కమిషనర్

బాలికల రక్షణకు చర్యలు తీసుకోండి

గూడూరు: బాలికల పరిరక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతూ గూడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గళం విప్పారు. కోల్‌కతాలో ఇటీవల పీజీ వైద్య విద్యార్థినిని దారుణంగా హతమార్చిన ఘటనను నిరసిస్తూ గురువారం గూడూరు హైస్కూలు విద్యార్థులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. కోల్‌కతా ఘటనలో బాధ్యులైన వారిని గుర్తించి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత, ఉపాధ్యాయులు ఎస్.పద్మజ, ప్రభాకరరావు, పీడీ అరుణ, హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ గోవాడ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మల్లవోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. పీహెచ్‌ఎన్ ఝాన్సీ రాణి ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, సిబ్బంది పీహెచ్‌సీ నుంచి మల్లవోలు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. మల్లవోలు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేశారు.



గూడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, అధ్యాపకుల నిరసన ప్రదర్శన



నిరసన తెలుపుతున్న మల్లవోలు పీహెచ్‌సీ సిబ్బంది

డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

పెడన: మండల పరిధిలోని చేవేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సాయంత్రం జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయి ఆకస్మిక తనిఖీ చేశారు. అప్పటికే కొందరు సిబ్బంది వెళ్లిపోవడం, ఉన్న వారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని ఓపీ రికార్డులను పరిశీలించి జ్వరాలు అధికంగా ఉంటున్నాయని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. చేవేంద్ర పీహెచ్‌సీ వైద్యురాలు రమ్యసాయి, ఎంపీహెచ్‌వో జీవీ సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.



చేవేంద్ర పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి

క్లుప్తంగా

నేడు 'ఉపాధి' గ్రామసభలు

గూడూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. సర్పంచుల అధ్యక్షతన జరిగే గ్రామసభలకు ఆయా పంచాయతీ కార్యదర్శులను కన్వీనర్లుగా నియమించారు. పర్యవేక్షకులుగా మండలస్థాయి అధికారులను నియమించినట్లు ఆయన వెల్లడించారు. సభల షెడ్యూల్‌ను ఆయన ప్రకటించారు.

పెడన మున్సిపల్ కమిషనర్‌గా గోపాలరావు



పెడన: పెడన పురపాలక సంఘ కమిషనర్‌గా ఎం.గోపాలరావును నియమిస్తూ గురువారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం గోపాలరావు తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన గతంలో పెడన పురపాలక సంఘంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా, ఇన్‌చార్జి కమిషనర్‌గా చేశారు. రెండు, మూడు రోజుల్లో పెడన కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్న బి.వెంకటరామయ్య పురపాలక పరిపాలన విభాగం కార్యాలయంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్



పెడన: గుడ్లవల్లేరు క్లస్టర్ పరిధిలోని పెడన మండలం కట్లపల్లి పాల ఉత్పత్తిదారుల సంఘంలో 2023–24 సంవత్సరానికి సొసైటీ బోనస్ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించింది. కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యుడు, పెడన జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్ రూ.1,11,060ను 94 మంది పాల ఉత్పత్తిదారులకు బోనస్ కింద అందజేశారు. ముక్కు వెంకయ్య బోనస్‌గా రూ.13,957తో పాటు స్టాండ్ ఫ్యాన్‌ను మొదటి బహుమతిగా అందుకున్నారు. ద్వితీయ బహుమతిని ముక్కు హనుమంతరావు రూ.6,800తో పాటు టేబుల్ ఫ్యాన్ అందుకున్నారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు పాల శీతల కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘ అధ్యక్షుడు ముక్కు వీర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహాగణపతి ఆలయానికి శంకుస్థాపన



బంటుమిల్లి: పెద తుమ్మిడి గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన నూతనంగా నిర్మించనున్న మహాగణపతి స్వామి ఆలయానికి గురువారం శంకుస్థాపన పూజ చేశారు. ఈ సందర్భంగా పండితులు సోమరాజుపల్లి శ్రావణ్‌కుమార్ వేదమంత్రాల నడుమ శంకుస్థాపన, గణపతి హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు యడ్లపల్లి రామ్ సుధీర్ తదితరులు పాల్గొని పూజలు చేశారు. గ్రామంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 23 సంవత్సరాలుగా గణేష్ నవరాత్రులు జరుగుతున్నాయి.

పిల్లల్లో అభ్యాసన మరింత మెరుగుపడాలి



పెడన: పిల్లల్లో అభ్యాసన మరింత మెరుగుపడాలని, దీనికి ఉపాధ్యాయులు శ్రమించాలని పెడన మండల విద్యాశాఖాధికారి –1 ఎంవీఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. ఆయన మండలంలోని దావోజీపాలెం, చోడవరం, పుల్లపాడు ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన పలు రికార్డులను పరిశీలించి విద్యార్థుల అభ్యాసనం ఎలా ఉందో స్వయంగా పరిశీలించారు. దావోజీపాలెం, చోడవరం పాఠశాలల్లో విద్యార్థులు బాగా చదవడం, రాయడం చేస్తున్నా పుల్లపాడులో వెనుకబడి ఉండటంపై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రాఘవేంద్రుడికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: రాబర్ట్సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉపాలయంగా ఉన్న మంత్రాలయ శ్రీరాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామివారు విశేష అలంకారంతో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఆరాధనోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈవో సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండండి

నాగాయలంక ఎస్సై రమేష్

నాగాయలంక: మండలంలో దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ట్రాక్టర్ల యాజమాన్యాలు ఇనుప దమ్ము చక్రాలతో రోడ్లపై తిరిగితే వాహనాలను సీజ్ చేస్తామని నాగాయలంక ఎస్ఐ జి.రమేష్ హెచ్చరించారు. పలు హెచ్చరికలతో మండలంలో చేపట్టిన ప్రచార ఆటో వాహనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ప్రజలు పనులకు, ఫంక్షన్లకు బయటకు వెళ్లినప్పుడు ఇంటికి తాళం వేసి వాటిని ఇంటి వద్ద ఎక్కడో పెట్టకుండా తమ వెంటే తీసుకెళ్లాలని బంగారం లాంటి విలువైన వస్తువులు, నగదు బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. సోషల్ మీడియా యాప్‌లలో ఎవరితో వ్యక్తిగత సమాచారం, టెక్నికల్ వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. గుర్తు తెలియని కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎవరైనా జూదం, గంజాయి లాంటి ఎటువంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన కఠినచర్యలు అమలు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మైక్ ప్రచారాన్ని ఎస్ఐ ప్రారంభించి, కానిస్టేబుల్ సాయంతో మండలంలోని అన్నిగ్రామాల్లో ప్రచారం చేయిస్తామని చెప్పారు.



నాగాయలంకలో మైకు ప్రచార ఆటో వాహనం వెంట కానిస్టేబుల్

ఘంటసాల: గ్రామాల్లో జరిగే దొంగతనాలపై పోలీసు వారి హెచ్చరికలను ప్రజలు పాటించాలని చల్లపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఈశ్వరరావు అన్నారు. ఘంటసాల మండల ప్రజలకు గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాలు, మోసాలు, తదితర అంశాల పై చల్లపల్లి సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఆటో ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్ చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసు వారి సూచనలు, సలహాలు పాటిస్తూ ఉండాలని సీఐ ఈశ్వరరావు కోరారు.

'హంసలదీవి' వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- కదిలిన అధికార యంత్రాంగం
- డీఎస్పీ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారుల ప్రత్యేక సమావేశం
- నేడు తీరానికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

సాక్షి ఎఫెక్ట్

కోడూరు: హంసలదీవి సాగర తీరంలో పర్యాటకుల ప్రాణాలకు భద్రత కల్పిస్తూ పటిష్టమైన ఏర్పాట్లు చేయనున్నట్లు అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. సాగరతీరంలో నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంపై 'సాక్షి' లో గురువారం 'పాలకాయతిప్ప బీచ్.. భద్రత తూచ్' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఇది ఎస్పీ దృష్టికి వెళ్లడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మత్స్యశాఖ, మెరైన్, పోలీస్ శాఖలతో డీఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 18న పాలకాయతిప్ప బీచ్ వద్ద గుడివాడకు చెందిన ఆరుగురు ముస్లిం కుటుంబీకులు అలల్లో కొట్టుకుపోయి, ఒకరు మృతిచెందడంతో మరొకరు సముద్రంలో గల్లంతై నేటి వరకు ఆచూకీ లభించకపోవడంపై అధికారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన యువకుడు ముషారఫ్ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించడంతో శుక్రవారం ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను పంపేందుకు అంగీకరించినట్లు డీఎస్పీ చెప్పారు. బారిగేడ్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులతో పాటు స్థానిక పోలీసులు కూడా తీరం వెంట గస్తీ నిర్వహించి, పర్యాటకులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులకు పర్యాటకులు కూడా సహకరించాలని తహసీల్దార్ శ్రీనునాయక్ అన్నారు. అఅవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ శిరీష, మత్స్యశాఖ ఏడీ ఆర్.ప్రతిభ, మెరైన్ ఎస్ఐ జిలానీ, ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ, డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న డీఎస్పీ, తహసీల్దార్

నాటిన ప్రతి మొక్కనూ పరిరక్షించుకోవాలి

భావదేవరపల్లి(నాగాయలంక): పర్యావరణ పరిరక్షణలో మొక్కలు పరమ పవిత్రమని తహసీల్దార్ హరనాథ్ చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన తల్లి పేరుతో ఒక మొక్క పిలుపులో భాగంగా మండలంలోని భావదేవరపల్లి పంచాయతీ పరిధిలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ మొక్కలు నాటారు. ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, కార్యదర్శి పి.మల్లికార్జునరావు, వీఆర్వో తిరుమలరావు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు: నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని డ్వామా పీడీ జి.వి.సూర్యనారాయణ కోరారు. తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని చిట్టిగూడూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమానికి పీడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచి లంకా చంద్రలీలతో కలసి పంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి గ్రామంలో అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ పి.రామ్మోహన్, ఏపీఓ ఎం.సంతోషరావు, టీఏ కె.రామాంజనేయులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీపీ నడకుదుటి జనసీకుమారి అన్నారు. మండల పరిధిలోని ఉత్తరచిరువోలులంక అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, పాఠశాల ఉపాధ్యాయులు గురవయ్య పాల్గొన్నారు.

ఘంటసాల: ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమం ఘంటసాలలో గురువారం నిర్వహించారు. ఎంజీఎన్ఆర్‌జీఎస్, పంచాయతీ శాఖ సంయుక్త ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఘంటసాలలో సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి, ఏపీవో రాజ్‌కుమార్ ఉద్యోగులు, సిబ్బందితో కలసి మొక్కలు నాటారు.



భావదేవరపల్లిలో మొక్క నాటుతున్న దృశ్యం



ఘంటసాలలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్ఐ ప్రతాప్ రెడ్డి

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెడన: బల్లిపర్రులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతికి, జూనియర్ ఇంటర్‌లో ఖాళీలను భర్తీ చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రూతమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ కేటగిరిలో 8, బీసీ–సీలో 10, ఎస్టీలో 3, ఓసీలో ఒకటి ఖాళీలున్నాయన్నారు. జూనియర్ ఇంటర్‌లో సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో రెండిటికి కలిపి ఎస్సీ–20, బీసీ–సీ–9, ఎస్టీ–9, బీసీ –1, ఓసీ–2 సీట్లు ఖాళీలున్నాయని పేర్కొన్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో నాలుగో తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుకున్న వారై తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష లోపు ఉన్న వారు ఐదో తరగతిలో ప్రవేశానికి అర్హులని, ఇటువంటి వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో చేరడానికి 2023–24లో పదో తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణులై తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షలోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

కొనసాగుతున్న గాలింపు

కోడూరు: పాలకాయతిప్ప బీచ్‌లో గల్లంతైన గుడివాడకు చెందిన యువకుడు ముషారఫ్ ఆచూకీ ఐదు రోజుల నుంచి వెదుకుతున్నా లభించలేదు. గురువారం కూడా అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐలు శిరీష, జిలానీలు ప్రత్యేక బోట్లపై గాలింపులో పాల్గొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు సీఐ యువకుమార్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీ.. వ్యక్తికి గాయాలు

పెడన: వ్యక్తిని ట్రాక్టరు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పట్టణంలోని 11వ వార్డుకు చెందిన పొగడ్త శామ్యూల్ ప్లాట్‌ఫాం రిక్షాపై ముగ్గును విక్రయిస్తూ సంచరిస్తుంటాడు. పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన ఆ రిక్షాపై పడుకున్న శామ్యూల్‌ను అక్కడే ఉంచి అతని భార్య దుకాణంలో సరుకులు కొనుగోలు చేస్తోంది. పెడన నుంచి గుడివాడ వైపుగా దమ్ము చక్రాలతో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ ప్లాట్‌ఫాం రిక్షాతో పాటు శామ్యూల్‌ను ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన మచిలీపట్నం ఆసుపత్రికి తరలించగా అక్కడి అవుట్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు శామ్యూల్ ఫిర్యాదుతో ఏఎస్ఐ టి సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

దాడి ఘటనలో..

పాఠశాలలో ఇద్దరు చిన్నారులు గొడవపడి ఇంటిలోని వారికి చెప్పడంతో ఓ పాప తండ్రి గొడవపడి గాయపరిచిన ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. నందమూరుకు చెందిన కె.కీర్తిలక్ష్మి తన కుమార్తె, కట్టా రాముడు కుమార్తెలు స్థానిక పాఠశాలలో చదువుకుంటున్నారు. వీరిద్దరి మధ్య గొడవ పెద్దల వరకు వెళ్లింది. కట్టా రాముడు.. కీర్తిలక్ష్మి ఇంటికి వెళ్లి గొడవ పడటమే కాకుండా దాడి చేసి గాయపరిచాడు. ఘటనపై కీర్తిలక్ష్మి తనను, తన తల్లిపై దాడి చేసి గాయపరిచారంటూ పెడన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సేవలు ఆదర్శనీయం



రక్తదాన శిబిరం ప్రారంభించిన మండలి రాజా, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, నాయకులు

నాగాయలంక: మెగాస్టార్ చిరంజీవి అభిమానులు అందిస్తున్న సామాజిక సేవలు, రక్తదానం, ఐ డొనేషన్ల స్ఫూర్తి ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచాయని దివి గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు, అవనిగడ్డ నియోజకవర్గం జనసేన నేత మండలి రాజా కొనియాడారు. అనూ గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్థానిక సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుక పురస్కరించుకుని స్థానిక శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లో గురువారం వైద్యశిబిరం, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ టీఎస్ఎస్ బాలాజీ వీటిని ప్రారంభించారు. పలువురు అభిమానులు రక్తదానం చేయగా, 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎస్ఐ జి.రమేష్, రెడ్‌క్రాస్ జిల్లా మేనేజర్ భవిరి శంకరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిర్వహణ సామర్థ్యం అవశ్యం

ఫిషరీస్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఎన్డీఆర్ఎఫ్ డెమో

భావదేవరపల్లి(నాగాయలంక): సమాజంలో విపత్తులు, ప్రమాదాలు జరిగినప్పుడు క్షేత్రస్థాయిలో వాటిని అధిగమించడానికి విద్యార్థులు, యువతలో సామర్థ్య నిర్వహణ అవశ్యమని తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ పేర్కొన్నారు. ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ వీవీఎస్ ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో టీమ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటు కుమార్ నంది ఆధ్వర్యంలో స్థానిక ఎంవీకెరావు ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు సామర్థ్య నిర్మాణ కార్యక్రమం(సీబీపీ) జరిగింది. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్డీఆర్ఎఫ్) రెస్క్యూ టీమ్ సిబ్బంది గురువారం నిర్వహించిన అవగాహన సదస్సు, ప్రదర్శన(డెమో) తహసీల్దార్ ప్రారంభించారు. విద్యార్థులకు వీటిపై శిక్షణ ఇచ్చారు. విపత్తుల సమయాల్లో సెల్ఫ్ డిఫెన్స్ విధానాలు, స్ట్రక్చర్ల నిర్మాణం, రోడ్డు ప్రమాదాలు జరిగితే చేపట్టాల్సిన ప్రాథమిక చికిత్స, ఆకస్మిక గుండె పోటుతో కుప్పకూలితే రక్షణకు అవకాశం ఉన్న సీపీఆర్ విధానం, వివరించారు. లిఫ్టింగ్ మూవ్‌మెంట్, పిడుగులు, భూకంపాలు, వరదలు, పాముకాటులాంటివి సంభవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్ చూపించారు. కార్యక్రమంలో సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, వైద్యాధికారులు కె.శివరామకృష్ణ, ఎం.ఇంద్రకుమార్, వీఆర్వో జి.తిరుమలరావు, కార్యదర్శి పి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



వరదలు, వాగులు పొంగినపుడు సెల్ఫ్ డిఫెన్స్‌తో ఎలా బయటపడాలో విద్యార్థులకు శిక్షణ

ఓటర్ల జాబితాల్లో తప్పులుండకూడదు

పెడన ఆర్వో వెంకటరమణ

పెడన: ఓటరు జాబితా పూర్తి పారదర్శకంగా ఉండేలా చూడాలని, ఎటువంటి తప్పులుండకూడదని పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్(ఆర్వో) అధికారి పి.వెంకటరమణ అన్నారు. గురువారం ఆయన పెడన తహసీల్దార్ కార్యాలయంలో పెడన నియోజకవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను తహసీల్దార్లతో పాటు మున్సిపల్ అధికారులతో ఓటరు జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఒక ఓటరు ఒక చోట ఉండేలా చూడాలన్నారు. రెండు, మూడు చోట్ల జాబితాలో రిపీట్ కానీయొద్దన్నారు. అవసరమైతే వివిధ రాజకీయ పార్టీల నాయకుల సహాయ సహకారాలను తీసుకోవాల్సిందిగా సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు అబ్దుల్ రహమాన్ మస్తానా, రాజ్యలక్ష్మి, భరత్‌రెడ్డి, సోమశేఖర్, మున్సిపల్ టీపీవో ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రారంభం

మోపిదేవి: నూతన ఓటర్ల నమోదుతో పాటు తొలగింపు కార్యక్రమం గురువారం నుంచి చేపట్టినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. బీఎల్వోలు ఇంటింటా తిరిగి ఓటరు వివరాల సేకరణ చేస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2025వ సంవత్సరం ఎస్ఎస్ఆర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు వారి వారి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రతి ఇంటా సర్వే చేసి వారి ఓటరు వివరాలు పరిశీలించాలని సూచించారు. ఎవరైనా మృతిచెందినా, వేరొక ప్రాంతానికి వెళ్లిన వారి ఓటును ఫారం–7 ద్వారా తొలగిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు నమోదుకు ఫారం–6 అర్జీ దాఖలుచేయాలని వివరించారు.

ముగ్గు దాటితే చర్యలు

బంటుమిల్లి: స్థానిక గాంధీ మండపం సెంటరులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న తోపుడు బండ్ల వ్యాపారులకు నిర్ణయించిన హద్దులు దాటితే చర్యలు తప్పవని ఎస్ఐ గణేష్‌కుమార్ హెచ్చరించారు. బంటుమిల్లిలో ఉదయం, సాయంత్రం గాంధీ మండపం సెంటరులో ట్రాఫిక్ సమస్యగా మారింది. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించడానికి ఎస్ఐ గణేష్ కుమార్ తోపుడు బండ్ల వ్యాపారులకు ముగ్గుపోసి హద్దులు నిర్ణయించారు. రోడ్లపై ఆటోవాలాలు, ద్విచక్ర వాహనచోదకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కొత్తగా ముగ్గు పోసి హద్దులు ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.